క్లుప్తంగా

స్త్రీల వ్యాధులపై అవగాహన కల్పించాలి



పెనుగొండలో స్త్రీల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుజయశ్రీ

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీల వ్యాధులపై అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలని పాలకొల్లు శేషాద్రి హస్పిటల్ వైద్యురాలు డాక్టర్ గుణ్ణం సజయశ్రీ అన్నారు. సోమవారం పెనుగొండలో ది ప్రైమరీ మెడికల్ ప్రాక్టిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పెనుగొండ యూనిట్ సర్వ సభ్య సమావేశంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గుణ్ణం నారాయణరావు, సంఘ అధ్యక్షుడు ఎన్‌కేవీవీ నారాయణ (కోటి), సీనియర్ సభ్యులు తోట వెంకటేశ్వరరావు, మండ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, సునీత పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



ఆచంట చెరువులో బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న కిషోర్

పెనుగొండ: ఆచంట చెరువులో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులు బొక్కా మారేమ్మ కుటుంబానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లు అందించి వారికి మనోధైర్యం కల్పించారు. ఎంపీటీసీ సభ్యులు ఉల్లం జ్యోతి రామానుజం, మనవర్తి విజయ్‌కుమార్, బొక్కా రామకృష్ణ, దాసరి ప్రశాంత్ పాల్గొన్నారు.

నరసాపురం తరలిన ప్రజాప్రతినిధులు



పెనుగొండ నుంచి తరలివెళ్లిన ప్రజాప్రతినిధులు

పెనుగొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి పెనుగొండ నుంచి పెనుగొండ, ఇరగవరం మండలాలకు చెందిన ఎంపీటీసీలు తరలివెళ్లారు. సోమవారం పెనుగొండలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించి పెనుగొండ ఎంపీపీ పూతీనిడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ పోడూరు గోవర్ధనతో పాటు పెనుగొండ మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, ఇరగవరం మండలానికి చెందిన పలువురు ఎంపీటీసీలు తరలివెళ్లారు.

26న ఎస్‌ఆర్‌కేఆర్‌లో అప్రెంటిస్ వర్కుషాపు

ఉండి: భీమవరంలోని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే అప్రెంటిస్ వర్కుషాపునకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, ఒకేషనల్ కాలేజ్‌లకు చెందిన ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు సోమవారం కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవస్థాపకత (ఎంట్రపెన్యూర్‌షిప్) శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వర్కుషాప్‌లో అప్రెంటిస్‌షిప్ సంస్కరణలపై, సరళీకరణలపై అవగాహనతో పాటుగా సందేహాల నివృత్తి చేస్తారన్నారు.

26న ఎస్‌ఆర్‌కేఆర్‌లో అప్రెంటిస్ వర్క్‌షాప్

ఉండి: భీమవరంలోని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే అప్రెంటిస్ వర్కుషాపునకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, ఒకేషనల్ కాలేజ్‌లకు చెందిన ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు సోమవారం కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవస్థాపకత (ఎంట్రపెన్యూర్‌షిప్) శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వర్కుషాప్‌లో అప్రెంటిస్‌షిప్ సంస్కరణలపై, సరళీకరణలపై అవగాహనతో పాటుగా సందేహాల నివృత్తి చేస్తారన్నారు.

స్వల్పకాలిక కోర్సుల్లో చేరండి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కిల్‌హబ్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న స్వల్పకాలిక కోర్సుల్లో ఆసక్తిగల యువకులు ఉచిత శిక్షణ పొందవచ్చని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. ఫీల్డ్‌టెక్నీషియన్ ఎయిర్ కండీషనర్ (3 నెలల శిక్షణ), ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్(3 నెలలు), అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ (3 నెలలు), ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (2 నెలలు), మెషిన్ ఆపరేటర్ (2 నెలలు) స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి రిజిస్ట్రేషన్స్ చేయించుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు 96760 99988 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చునని వివరించారు.

నరసాపురంలో 99.12 శాతం పోలింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న 10 మండలాల ప్రజాప్రతినిధులు



బ్యాలెట్ బాక్సులకు సీల్ వేయిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ



ఓటు వేయడానికి వస్తోన్న పోడూరు మండల ఎంపీటీసీ సభ్యులు

నరసాపురం: నరసాపురంలో సోమవారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, యలమంచిలి, పెనుగొండ, పెనుమంట్ర, తణుకు, ఇరగవరం, పోడూరు, ఆచంట మండలాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ఎంపీటీసీలు 182 మంది, జెడ్పీటీసీ సభ్యులు 10 మంది, నరసాపురం మున్సిపాలిటీకి చెందిన 31 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఐదుగురు ఉన్నారు. మొత్తంగా డివిజన్‌లో 229 ఓట్లు ఉండగా, వాటిలో 227 ఓట్లు పోలయ్యాయి. ఎంపీ రఘురామకృష్ణంరాజు, మరో స్థానిక సంస్థ ప్రతినిధి మినహా మిగిలిన వారందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మధ్యాహ్నం 1.30 గంటలకే ముగిసిన పోలింగ్

మొగల్తూరురోడ్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగానే స్థానిక సంస్థల ప్రతినిధులు ఒకొక్కరూ రావడం ప్రారంభించారు. మధ్యాహ్నం 1.30 గంటలకే పోలింగ్ దాదాపుగా పూర్తయ్యింది. అయితే ఇంకా 2 ఓట్లు మిగిలి ఉండటంతో అధికారులు సాయంత్రం నాలుగు గంటల వరకు వేచి చూశారు. నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ దగ్గరుండి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

ఓటు వేసిన ప్రముఖులు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, తణుకు ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ కలసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మధ్యాహ్నం 1 గంట దాటిన తరువాత వచ్చి ఓటు వేశారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, టీడీపీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నరసాపురం డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐలు శ్రీనివాసయాదవ్, సురేషకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మండలాల వారీగా ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
పోడూరు	20	20
పెనుగొండ	21	20
పాలకొల్లు	17	17
యలమంచిలి	18	18
నరసాపురం	56	55
మొగల్తూరు	22	22
ఆచంట	18	18
పెనుమంట్ర	18	18
ఇరగవరం	20	20
తణుకు	19	19



నరసాపురం పోలింగ్ కేంద్రంలో ఓటును పరిశీలిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు



బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది

యూటీఎఫ్ టాలెంట్ టెస్ట్ ఫలితాల వెల్లడి

పోడూరు: మండల స్థాయిలో యూటీఎఫ్ అధ్వర్యంలో ఈ నెల 5న జరిగిన ఐదు, పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన 21వ ప్రతిభా పాటవ పరీక్షా ఫలితాలను సోమవారం యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి క్షేమమూర్తి, కేతా నాగరాజు విడుదల చేశారు. ఐదో తరగతిలో ప్రథమ స్థానం నడివింటి రామ్ సత్య బాలాజీ, రెండో స్థానం చికిలే శామ్యూల్, మూడో స్థానం టి.యశ్వంత్ కుమార్, వి.ప్రీతి చందన సాధించారు. పదో తరగతి తెలుగు మీడియంలో ప్రథమ స్థానం చదలవాడ రామలక్ష్మి జెడ్పీ హైస్కూల్ గుమ్మలూరు, రెండో స్థానంలో కేతా జ్యోత్స్న జెడ్పీ హైస్కూల్ పండితవిల్లూరు, ఇంగ్లిష్ మీడియం విభాగంలో ప్రథమస్థానం వీరవల్లి మోహన్‌ప్రియ జెడ్పీ హైస్కూల్ కవిటం, రెండో స్థానంలో వాసా దివ్యశ్రీ జెడ్పీ హైస్కూల్ గుమ్మలూరు నిలిచారు. విజేతలకు త్వరలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఆకులా.. కాయలా



లక్ష్మణేశ్వరంలో నిండా మునక్కాయలతో ఉన్న మునగ చెట్టును చూపుతున్న కూర్మారావు

లక్ష్మణేశ్వరంలోని తెలగంశెట్టివారి మెరక రోడ్డు పక్కనే ఉన్న ఓ మునగ చెట్టు అటుగా వెళ్లే బాటసారులందరిని ఆకర్షిస్తోంది. తెలగంశెట్టి కూర్మారావు అనే రైతు తన ఇంటి పెరట్లో ఉన్న ఈ చెట్టుకు ఈ ఏడాది పూత పూసిన నాటి నుంచి ఆకులు మాయమై కేవలం కాయలతోనే కనిపిస్తోంది. అయితే ఆ దారిన వెళ్లేవారు ఈ చెట్టును చూసి అన్నీ కాయలేనా అంటూ ఆశ్చర్యచకితులవుతున్నారు. – నరసాపురం రూరల్

గెలుపు లాంఛనమే



మహిళా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో రుడా చైర్మన్ షర్మిళ

పెనుగొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం లాంఛనమేనని ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆచంట నియోజకవర్గం నుంచి నరసాపురం తరలివెళ్లిన జెడ్పీటీసీ, ఎంపీపీలు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వంక రవీంద్ర, కవురు శ్రీనివాస్ మంచి మెజార్టీతో గెలుపొందుతారన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసిన టీడీపీ నాయకులకు కనీసం డిపాజిట్లు దక్కవన్నారు. పోటీచేయకుండా ఉంటే కనీసం పరువైనా దక్కేదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలే వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు శ్రీరామ రక్షగా నిలుస్తాయన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు, కేవీఎస్ నారాయణ రెడ్డి(వాసు), సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ సభ్యులు పోడూరి గోవర్ధన, గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇక నుంచి ఏటా తెప్పోత్సవం చేపట్టాలి సారూ..



వినతిపత్రాలు అందజేస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయంలోని కొట్టాయం మండపంలో నిర్వహించేలా, కల్యాణం అనంతరం తెప్పోత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కొందరు భక్తులు ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణలకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఏప్రిల్ 1న తెల్లవారుజామున 5.30 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం జరగనుంది. ఏటా స్వామివారి కల్యాణాన్ని ఆలయంలో పార్వతిదేవి అమ్మవారి విగ్రహం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారని, దీని వల్ల కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులకు అనువుగా లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్వామివారి కల్యాణాన్ని ఆలయ ప్రాకార మండపంలో ఉన్న కొట్టాయం (ముక్కోటి ఏకాదశి నాడు ఉత్సవ మూర్తులు కొలువై ఉండే మండపం)లో నిర్వహిస్తే ఎక్కువ మంది భక్తులు తిలకించేందుకు అనువుగా ఉంటుందన్నారు. అలాగే కల్యాణం అనంతరం స్వామివారికి తెప్పోత్సవం జరిపించాలంటూ మరికొందరు భక్తులు మరో వినతిపత్రం అందజేశారు. స్వామివారి కల్యాణం అనంతరం ప్రతి చోట తెప్పోత్సవం జరుపుతుంటారని, అలాగే పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామికి కూడా తెప్పోత్సవం జరిపించేలా అధికారులు, పాలకమండలి సభ్యులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు ఈ సందర్భంగా చెప్పారు. భాకూరి సత్యనిరంజన్, ఆదిమూలం సోమేశ్వరరావు, శీరం ఆందకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో ఘనంగా పోలేరమ్మ జాతర

పాలకోడేరు: కోరుకొల్లు గ్రామ దేవత పోలేరమ్మ జాతరను సోమవారం రాత్రి ఆలయ కమిటీ గ్రామస్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుట్ట బొమ్మలు, కోయ డాన్సులు, గరగ నృత్యాలతో అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామస్తులతోపాటు ఆడపడుచులు తరలివచ్చారు. సర్పంచ్ మంతెన భారతి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగీంద్ర కుమార్ బాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మొగల్తూరు గ్రామం మీదుగా బస్సులు నడపాలి

మొగల్తూరు: కాకినాడ – అవనిగడ్డ మధ్య నడుస్తున్న ఆర్టీసీ బస్సులు మొగల్తూరు గ్రామం నుంచి కాక హైవే మీదుగా వెళ్లిపోతుండటంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నిర్మాణం దాదాపుగా పూర్తికావడంతో కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి గత వారం రోజులుగా ప్రతి రోజు రెండు ట్రిప్పులు నడుపుతోంది. అయితే కాకినాడ నుండి ఆవనిగడ్డ, ఆవనిగడ్డ నుండి కాకినాడ వెళ్ళే బస్సులు మొగల్తూరు గ్రామంలో నుండి కాక జాతీయ రహదారి మీదుగా వెళుతున్నాయి. కాకినాడలో ఉదయం 5గంటలకు బయలుదేరే బస్సు నరసాపురం మీదుగా మొగల్తూరుకు ఉదయం 9 గంటల సమయంలో చేరుకుంటోంది. అటు ఆవనిగడ్డలో మధ్యాహ్నం 1.45 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.20 గంటలకు మొగల్తూరు చేరుకుంటుంది. ఈరెండు బస్సులు కూడా మొగల్తూరు జాతీయ రహదారి మీదుగా నరసాపురం చేరుకుంటున్నాయి. మొగల్తూరు సమీపంలో హైవేపై బస్సులు నిలుపుతున్నా గ్రామంలోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాప్రతినిదులు స్పందించి కాకినాడు – ఆవనిగడ్డ బస్సులు మొగల్తూరు గ్రామం మీదుగా వెళ్లేలా కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా పెనుమదం అమ్మవార్ల జాతర

పోడూరు: పెనుమదంలో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మమ్మ, గంట్లమ్మ, ధన కొండ్లమ్మ, పోలేరమ్మ, చల్లాలమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు గత 12 రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ వాయిద్య మేళ తాళాలతో, డప్పులు, భజింత్రీలతో, అసాధులు అమ్మవార్ల ఘటాలతో చేసిన నృత్యాలతో, బుట్ట బొమ్మలు, కోయడ్యాన్సులతో, కాళికా మాత వేషధారణలతో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో, బాణచాంచా కాంతులతో, అత్యంత ఘనంగా అమ్మవార్ల జాతర నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తులతో పాటు, కొత్తగా పెళ్లైన నూతన దంపతులు అమ్మవార్లను దర్శించుకుని ధూపదీపాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్ల జాతర పురస్కరించుకుని అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పలువురు ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్ కర్రి రామచంద్రరావు (పెద్దబ్బాయి), దేవస్థానం చైర్మన్ దేవరపు వీరరాఘవులు, ఈవో పిల్లి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు కవురు నర్సింహమూర్తి (తాతయ్య), దేవరపు దొరబాబు, తంగెళ్ల సత్యనారాయణ, సన్నిధి బదరీనారాయణ, మాకా సాయిబాబు, కట్టా మరేశ్వరరావు, ముద్దాల నరసింహరావు, గుబ్బల లక్ష్మీనారాయణ, ఆళ్ల శాంతరాజు, చల్లాలమ్మ సేవా సమితి సభ్యులు అమ్మవార్ల జాతర ఉత్సవాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

13 మందికి వైకల్య పరీక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ప్రభుత్వాసుపత్రిలో సోమవారం సదరం క్యాంపులో డాక్టర్ బి.శ్రీనివాస్ స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన 13 మంది పేషెంట్లను పరీక్షించి వారి అంగవైకల్యం శాతాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారి సదరం క్యాంపునకు వచ్చి అంగవైకల్య శాతం తక్కువగా ఉందని భావించిన వారు రెండోసారి కూడా స్లాట్ బుక్ చేసుకుని మరొక సదరం క్యాంప్‌నకు వెళ్లి అంగవైకల్యం శాతాన్ని నమోదు చేయించుకోవచ్చని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పూర్తి హాజరు



ఓటు వేయడానికి వెళుతున్న పెనుమంట్ర ఎంపీటీసీలు

పెనుమంట్ర: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నర్సాపురంలో జరిగిన పోలింగ్‌లో పెనుమంట్ర మండలానికి చెందిన 18 మంది హాజరై ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల జెడ్పీటీసీ సభ్యుడితో పాటు, 17 మంది ఎంపీటీసీ సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 11 మంది మహిళలు కాగా, ఏడుగురు పురుషులు ఉన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్, ఈది అనితలు ఓటుహక్కు వినియోగించుకోగా, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ లక్ష్మీ, కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణ రెడ్డి,కర్రి లక్ష్మీ, పలివెల ఆశాలత, గెడ్డం ఈశ్వరుడు, నాగరాజులక్ష్మీ, మాంద్రు శాంత కుమారి, గండి రామారావు, చింతపల్లి మంగా దేవి, పెచ్చెట్టి నరసింహమూర్తి, మాసిరెడ్డి నాగదుర్గ, తమనంపూడి నాగ వెంకట సత్యనారాయణరెడ్డి, దండు లక్ష్మీ ఓటు వేశారు.

మామిడి పూత నిలిచేనా!



రామన్నపాలెంలో మామిడి చెట్టుకు మందు పిచికారీ చేస్తున్న రైతు

మొగల్తూరు: ఈఏడాది మామిడి పూతను నిలుపుకునేందుకు రైతు నానా పాట్లు పడుతున్నారు. ప్రతి ఏడాది మార్చి నాటికి కాయ తయారై కోసేందుకు రైతులు సిద్ధమయ్యేవారు. అయితే ఈ ఏడాది ఇప్పటికే రెండు, మూడుసార్లు మందులు పిచికారీ చేసినా పూత నిలబడకపోవడం లేదా మాడిపోవడం జరిగింది. దీంతో మరోసారి మందులు పిచికారీ చేస్తున్నారు. మండలంలో సుమారు 650 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఇంటి పెరటిలో, కొబ్బరి తోటల్లోను వీటిని పెంచుతున్నారు. తోటలోని చెట్లకు పూసిన పూత, చెట్ల పరిమాణాన్ని బట్టి కౌలు రైతులు రూ.50 వేలు నుంచి రూ.లక్ష పైబడి తోటలు కౌని సస్యరక్షణ చర్యలు చేపట్టి దిగుబడి వచ్చిన తరువాత కాయలు అమ్ముకుంటారు. ఈఏడాది కౌలు రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు మందులు పిచికారీకి వినియోగించడంతో పాటు తోట యజామానులుకు కూడా కొంత మొత్తం నగదు చెల్లించారు. గత ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో పాటు డిసెంబర్, జనవరి నెలలో మామిడి పూత బాగా పూయడంతో రైతులు తోటలు కౌలుకు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. అయితే జనవరి నెలాఖరులోను, ఫిబ్రవరిలో మంచు కురిసి పూత, పిందె మాడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం కూడా మంచు కురవడంతో పూసిన పూత మాడిపోవడంతో మరోసారి మందులు పిచికారీ చేస్తున్నారు. దీని ప్రభావం దిగుబడిపై చూపిస్తుందని, అనుకున్నంతగా దిగుబడి ఉండకపోవచ్చుని మన్నె వెంకటేశ్వరరావు అనే కౌలు రైతు ఆవేదన చెందుతున్నాడు.

హుండీల లెక్కింపు

వీరవాసరం: వీరవాసరం, రాయకుదురు గ్రామాలలోని ఆలయాల్లో సోమవారం హుండీలను లెక్కించినట్లు ఈఓ పులగం వేణుగోపాల్ చెప్పారు. శ్రీవీరేశ్వర విశ్వేశ్వరస్వామి ఆలయంలో రూ.28,200, శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో రూ.25,300గా ఆదాయంగా వచ్చాయన్నారు. కందుల సురేష్, శేఖర్, వెంకటేశ్వర్ రావు ,శంకరమంచి రఘు రామ శర్మ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నరసాపురం వారు నాకిచ్చిన సూచనలను ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ ... శ్రీ నక్కిన శ్రీనివాస తాతాజీ తండ్రి వెంకటస్వామి ... ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నెం.728/2028 ఆర్.యస్.నెం. 27/1ఎ, 50 సెంట్లు, (2420 చ.గ.) మొగల్తూరు మండలం కొత్తోటకు గ్రామానికి చెందిన ఖాళీ స్థలానికి హద్దులు తూర్పు: నక్కిన సురేష్, తదితర్ల స్థలాలు, పడమర: నక్కిన కనకరాజు స్థలం, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: నక్కిన విజయభాస్కర్, శ్రీనివాస తాతాజీ స్థలాలు.

పి.డి.యస్.వి.బాలాజీ B.Com., B.L., అడ్వకేటు, పాలకొల్లు. సెల్ నెం.94904 33732

నులి పురుగు వల్ల రక్తహీనత



లంకలకోడేరులో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పాలకొల్లు అర్బన్: నులి పురుగు వలన రక్తహీనత కలుగుతుందని లంకలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. అపరిశుభ్రమైన పరిసరాల్లో, కలుషితమైన వాతావరణంలో నులిపురుగులు వ్యాపిస్తాయన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఈ నులిపురుగు నివారణ మాత్రలు ఆరోగ్య సిబ్బంది నేతృత్వంలో మింగిస్తారన్నారు. దీనికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. భోజనం చేసిన తరువాత ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రలు విద్యార్థులు మింగాలన్నారు. 1-2వయస్సులోపు వారికి 200 మిల్లీ గ్రాములు, 2-19 వయస్సు వారికి 400 మిల్లీగ్రాముల మాత్రలు మింగాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి కె ప్రభాకరరావు, సూపర్‌వైజర్లు ఎలిజబెత్, వైఎస్ మూర్తి, అమరేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాజీకి ఘన సత్కారం

సాక్షి, భీమవరం: ప్రభుత్వ ఖాజీగా నియమితులైన మహమ్మద్ మోయజీ ఆలం ఫైజీని ముస్లింలు సోమవారం ఘనంగా సత్కరించారు. భీమవరం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మహమ్మద్ సిద్ధిక్ మాట్లాడుతూ నిఖా వ్యవస్థ చాలా పవిత్రమైందని, దీనిని గవర్నమెంట్ ఖాజీలు ఎంతో బాధ్యతతో నిర్వహించాలన్నారు. డివిజన్‌కు మహమ్మద్ మోయజీ ఆలం ఫైజి గవర్నమెంట్ ఖాజీగా నియమితులు కావడంపై ముస్లింలు ఎంతో సంతోషించారన్నారు. భీమవరం ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ రబ్బాని, మొహమ్మద్ కరీముల్లా బాషా, ఇమామ్ పాల్గొన్నారు.

కులాల వారీగా జనగణన చేపట్టాలి



మాట్లాడుతున్న గూడూరి వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న జన గణనను కులాల వారీగా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పాలకొల్లులో బీసీ సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులప్రాతిపదికన జనగణన చేయడానికి ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ముందుకు వస్తున్నాయన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా కుల గణన చేయడానికి కేంద్రానికి సిఫార్సు చేయాలని వెంకటేశ్వరరావు కోరారు. కేంద్ర ప్రభుత్వంలో రిజర్వేషన్ శాతం పెంచడానికి బీసీ జనాబా ఎంత మంది ఉన్నారో కచ్చితమైన లెక్కలు లేవన్నారు. దీనివల్ల బీసీలు అవకాశాలు కోల్పోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై బీసీలకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. బీసీలంతా ఐక్యతగా ఉంటే మెజార్టీగా ఉంటారని, అలాగే విడిపోతే మైనార్టీ వర్గాలుగా మిగిలిపోతారని అన్నారు. నియోజకవర్గ ప్రతినిధి కెల్లా పెద్దిరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు బొక్కా గంగాధర్, జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యం, పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు గానబోయిన వెంకట దుర్గారావు, రూరల్-1 గుబ్బల నాగేశ్వరరావు, రూరల్-2 అధ్యక్షులు ధనకొండ సత్యనారాయణ, సంఘ నాయకులు కాండ్రేకుల సత్యనారాయణ, వాసాచిన కోట గణేశ్వరరావు, అనిశెట్టి నవీన్ తదితరులు పాల్గొన్నారు.